ముగిసిననామినేషన్ల పరిశీలన

కర్నూలు న్యూసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్థాయీ సంఘం కమిటీ సభ్యుల ఎన్ని కలకు సంబంధించి నామినేషన్ల పరిశీ లన ప్రక్రియ పూర్తయింది. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అధ్యక్షతన అభ్యర్థుల సమక్షంలో పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సక్రమంగా ఉండటంతో అన్నిం టిని ఆమోదించినట్లు అడిషనల్ కమిషనర్ పేర్కొన్నారు. 28న విత్ డ్రా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మేనేజర్ చిన్నరాముడు, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, అభ్యర్థులు నారాయణరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.



ఎమ్మిగనూరు పట్టణంలో ఏపీ టిడ్కో ఇళ్ల సముదాయం పక్కనే అసంపూర్తిగా ఆగిపోయిన పేదల ఇళ్లు

ఇళ్లు.. ఎన్నేళ్లు..!

వైసీపీ హయాంలో నాటి సీఎం జగన్ ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తాం..! అంటూ ప్రగల్బాలు పలికారు. జగనన్న కాలనీల పేరిట జరిగిన భూసేకరణలో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. పేదల ఇళ్లు నిర్మాణంలో ఐదేళ్లు నిర్లక్ష్యం కారణంగా పేదలకు సొంతిల్లు కలగానే మారింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో సొంతింటిపై పేదల ఆశలు చిగురించాయి. అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు కల్పిస్తారని ఆశించారు. ఏడాది గడిచింది. ఆశలు ఎండమావిగా మారాయి. ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. వాటి కోసం ఖర్చు చేసిన రూ.601.69 కోట్లు ప్రజాధనం నిరర్థకంగా మారింది. అంతేకాదు పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చినా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో గూడు లేని నిరుపేదలు ప్రభుత్వ ఇళ్ల కోసం ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు.

- వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా పురోగతి మందగమనం
- జిల్లాలో 11,706 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటికే ఖర్చు చేసిన రూ.601.69 కోట్లు నిరుపయోగం
- అసంపూర్తిగా పేదల ఇళ్లు

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల నిర్మాణంలో అంతులేని జాప్యం కనిపిస్తోంది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీ పట్టణాలు, 26 మండలాల పరిధిలో పీఎంఏవై (అర్బన్, గ్రామీణ) కింద 2014-15 నుంచి 2023-24 వరకు పదేళ్లలో పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు 53,967 ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 50,032 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టారు. అందులో 29,408 ఇళ్లు పూర్తి చేశామని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. వివిధ దశల్లో ఉన్న 20,711 ఇళ్లను పూర్తి చేసి పేదలకు గూడు, నీడ కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. వాస్తవంగా గతేడాది డిసెంబరు ఆఖరిలోగా 4,422 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా టార్గెట్ ఇచ్చినా అది జరగలేదు. తాజాగా వివిధ దశల్లో ఉన్న 20,711 ఇళ్లలో 11,706 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశం కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలతో జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా గృహ నిర్మాణ శాఖ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. పలు పట్టణాల్లో ప్రభుత్వం ఇళ్లు అసంపూర్తిగా వదిలేశారు. వాటిని పూర్తి చేసి పేదలకు అప్పగించపోతే నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకొని కుప్పకూలే పరిస్థితి ఉంది.



ఇంటి లోపల గోడలకు ప్లాస్టింగ్ చేయకుండా బండలు, విద్యుత్ సౌకర్యం లేకుండా ఇలా వదిలేశారు



నాలుగు గోడలు కట్టి, ఆ గోడలపై ఆర్‌సీసీ స్లాబ్ వేసి ఇలా వదిలేశారు

అసంపూర్తి ఇళ్లు.. పట్టించుకోని పాలకులు

ఎమ్మిగనూరు పట్టణంలో మాచాని శివన్న నగర్‌లో ఏపీ టిడ్కో ఇళ్ల సముదాయం పక్కనే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ నిర్మాణం పేరిట 2,300 ఇళ్లు మంజూరు చేశారు. 1999-2004 మధ్యలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి పట్టణంలో పేదలకు ఒక్కొక్కరికీ మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం పట్టాలు ఇచ్చారు. 2021-22లో వైసీపీ ప్రభుత్వం ఆ పట్టాలను రద్దు చేసి జగనన్న కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2,300 ఇళ్లను మంజూరు చేయడంతో పాటు నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రూ.46.88 కోట్లు ఖర్చు చేసి 2,204 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు రికార్డుల్లో చూపించారు. కాంట్రాక్ట్ సంస్థ కేవలం నాలుగు గోడలు నిర్మించి, ఆర్‌సీ స్లాబ్ వేసి చేతులు దులుపుకుంది. రికార్డుల్లో ఇంటి నిర్మాణం పూర్తయినట్లు చూపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇంటి లోపల గోడలకు ప్లాస్టింగ్ చేయలేదు. ఫ్లోర్ వేయలేదు. విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. స్నానపు గదులు, మరుగుదొడ్లు కూడా నిర్మించలేదు. వీటిని లబ్ధిదారుడు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాలని అంటున్నారు. అంటే లబ్ధిదారుడు రూ.1.50 - రూ.2 లక్షలకు పైగా అదనంగా భరించాల్సి వస్తుంది.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కరువు

మిగతా 6వ పేజీలో

లక్ష్యం నెరవేరేనా?

జిల్లాలో వివిధ దశల్లో 20,711 ఇళ్లు ఉన్నాయి. అందులో 11,706 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని టార్గెట్ పెట్టుకున్నారు. వారం వారం కలెక్టరు పి.రంజిత్‌బాషా ప్రభుత్వ ఇళ్ల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు పూర్తి చేసిన టార్గెట్ 7,928 ఇళ్లు. ఇంకా 3,778 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. ఏపీ గృహ నిర్మాణ శాఖ చూపిస్తున్న రికార్డుల్లో చూపని లెక్కలు ఇవి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ఎమ్మిగనూరు, ఆదోని తరహాలో నాలుగు గోడలు కట్టి, దానిపై ఆర్‌సీసీ స్లాబ్ వేస్తే ఇల్లు నిర్మాణం పూర్తయినట్లు లెక్కల్లో చూపుతున్నారు. ఇంటి లోపల సిమెంట్ ప్లాస్టింగ్, బండలు, మరుగుదొడ్లు.. వంటి సౌకర్యాలు మెజార్టీ ఇళ్లకు లేవని తెలుస్తోంది.

ఉత్సవాలకుప్రముఖులకు ఆహ్వానం

మంత్రాలయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి 354 సప్తరాత్రోత్సవాలకు రావాలని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్‌కు అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, కృష్ణ కౌశిక్, శ్రీషాజోయీష్ ఆహ్వానించారు. శుక్రవారం బెంగళూరు లోని హోంమంత్రి నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేసి ఉత్సవాలకు హాజరు కావాలని విజ్ఞప్తిచేశారు. కన్నడ ప్రముఖ సినీ నటుడు శివరాజ్‌కుమా ర్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా, డీఐజీ కోయ ప్రవీణ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్కే శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ అనంత పురా ణిక్ కలిసి ఆహ్వానపత్రికలు అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఇచ్చిన రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. అనంతరం ఫోన్‌లో పీఠాధిపతితో మాట్లాడించారు.



కలెక్టర్ రంజిత్‌బాషాకు రాఘవేంద్రస్వామి జ్ఞాపికను ఇస్తున్న శ్రీమఠం అధికారులు

పోలీసుల అదుపులో మున్సిపల్ వైస్ చైర్మన్

బెదిరింపుల కేసులో పోలీసుల విచారణ

ఎమ్మిగనూరు జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వ్యాపారితో జరిపిన ఆర్థిక లావాదేవీలు, బెదిరింపుల కేసులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్‌ను పట్టణ పోలీసులు విచారించారు. శుక్రవారం అతడిని అదుపులోకి తీసు కున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన హయాత్‌అలీ అనే వ్యక్తికి మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయి. హయత్‌అలీకి రూ.17.50 లక్షలు మున్సిపల్ వైస్‌చైర్మన్ బాకీపడ్డాడు. బెదిరింపులకు పాల్పడటంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో నజీర్ అహ్మద్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో వైస్‌చైర్మన్‌ను విచారణ చేసేందుకు పలుమార్లు పిలిచినా హాజరు కాకపోవటంతో శుక్రవారం పట్టణ పోలీసులు నజీర్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకొని 41ఏ సీఆర్‌పీ సెక్షన్ కింద నోటీసులిచ్చి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



నజీర్ అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్

వంద మంది విద్యార్థులు ఉండాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో వంద మంది విద్యార్థులు అడ్మిషన్లు విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవోలను, వార్డెన్లను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి బి.రాధిక ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏఎస్‌డబ్ల్యూవోలు(సహాయ సంక్షేమ అధికారులను), వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని హాస్టళ్లలో 50 మంది కంటే తక్కువగా ఉన్నారని అన్నారు. అడిష్మన్ల సంఖ్య పెంచాలని ఆదేశించారు. విద్యార్థులకు భద్రత కల్పిస్తూ వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజన మెనూలో ఎట్టి పరిస్థితుల్లో తేడాలు ఉండరాదని, ఒకవేళ తేడాలు వస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. బాలికల వసతి గృహాలకు పెట్రోలింగ్ జరిగేలా ఆయా పోలీస్‌స్టేషన్లను సంప్రదించి పోలీసుల సహకారం పొందాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమ శాఖ అధికారులు బి.మద్దిలేటి, బాబు, లీలావతి, హాస్టల్ వార్డెన్లు సుంకన్న, మదాసిర్, మల్లికార్జున, రజని, సులోచన పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు

- భారత వాతావరణ సంస్థ వెల్లడి
- వర్షాధార పంటలకు అనుకూలం
- తెగుళ్లపై అప్రమత్తం చేస్తున్న శాస్త్రవేత్తలు



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో శనివారం నుంచి ఈనెలాఖరు వరకు చిరుజల్లుల నుంచి అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ వెల్లడించింది. వర్షాలతో పాటు నైరుతి నుంచి పశ్చిమ దిశగా గాలులు గంటకు 10నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో ఉదయం పూట తేమ 68 నుంచి 73శాతం, మధ్యాహ్నం 50 నుంచి 72శాతం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు అందిస్తున్నారు. రాబోయే ఐదు రోజుల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నందున వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలను ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చని సూచిస్తున్నారు. పంటలకు ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

వేరుశనగలో పొగాకు లద్దె పురుగులు



జూన్ రెండో పక్షంలో విత్తిన వేరుశనగ పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు రసం పీల్చే, పొగాకు లద్దె, శనగపచ్చ పురుగులు ఆశించే అవకాశముంది. రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించడానికి వేరుశనగ పొలంలో జిగురుఅట్టలు(ఎకరానికి 10), ఫెరోమోన్‌ట్రాప్స్(ఎకరానికి 4) అమర్చుకోవాలి. పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు పంట విత్తిన 10 నుంచి 15రోజుల లోపు ఎకరాకు 4 లింగార్షకబుట్టలు పెట్టి మగరెక్కల పురుగులను ఆకర్షింపజేయాలన్నారు. ఎదిగిన లార్వాలకు లీటరు నీటికి ఏమామెక్టిన్‌వబెంజోయేట్ 0.4గ్రాములు, లేదా క్లోరిఫైరిఫాస్ 2.5ఎంఎల్ పిచికారి చేయాలి.



పత్తిలో రసం పీల్చే పురుగు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తి పంట రసం పీల్చే పురుగు ఆశించొచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. లీటరు నీటికి వేపనూనె 5.0ఎంఎల్ లేదా ఐదుశాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.

మొక్కజొన్నలో కత్తెరపురుగు



ప్రస్తుతం మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంది. పురుగు ఉనికిని గుర్తించడానికి ఎకరాకు నాలుగు ఫిరమోన్ ఎరలు ఏర్పాటు చేయాలి. ఒక ఫిరమోన్ ఎరలో 10 పురుగులు పడినట్లయితే వెంటనే లీటరు నీటికి 5 ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పురుగు ఉధృతిని బట్టి లీటరు నీటికి రెండు గ్రాముల థయోడికార్బ్ లేదా 0.4గ్రాముల ఇమామేక్టిన్ బెంజోయెట్ పిచికారి చేయాలి.



స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

సీమను సస్యశ్యామలం చేస్తాం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

7

పాలకొలనులో మిస్సైల్ ప్రయోగం



నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు వద్ద హంద్రీనీవా పంపింగ్ స్టేషన్ (పీఎస్-2)నుంచి 8 పంపులు ద్వారా కాలువకు కృష్ణా జలాలు

8 పంపుల ద్వారా హంద్రీనీవాకు నీటి విడుదల

- 2,720 క్యూసెక్కులు లిఫ్ట్
- కాలువను పరిశీలించిన సీఈ నాగరాజు

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ అధికారులు హంద్రీనీవా కాలువకు నీటి విడుదలను క్రమక్రమంగా పెంచుతున్నారు. శుక్రవారం మరో పంపు పెంచి నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా పంపింగ్ స్టేషన్ (పీఎస్-2) నుంచి 8 పంపుల ద్వారా 2,720 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు అనంతపురం సీఈ నాగరాజు, కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ నాగరాజు, ఈఈ ప్రసాద్‌రావుతో పాటు ఇంజనీర్లు కాలువను పరిశీలించారు. కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు డిజైన్ చేశారు. 12 పంపులు ఏర్పాటు చేశారు. 2012లో కృష్ణా జలాలు ఎత్తిపోతలు చేపట్టినా 1,800 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి ఎత్తిపోయలేని పరిస్థితి ఉండేది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఫేజ్-1లో 3,850 క్యూసెక్కులు ప్రవాహానికి వీలుగా రూ.690 కోట్లతో విస్తరణ పనులు చేపట్టి దాదాపుగా పూర్తి చేశారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు మాల్యాల వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి కృష్ణా జలాలు ఎత్తిపోతలు ప్రారంభించారు. ఇంజనీర్లు క్రమక్రమంగా 8 పంపులకు పెంచి 2,720 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. 12 పంపులతో పూర్తిస్థాయిలో నీటిని తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణగిరి మండలం అలంకొండ నుంచి మద్దికెర మండలం బురుజుల గ్రామం వరకు హంద్రీనీవా కాలువను సీఈ నాగరాజు, ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ ప్రసాద్‌రావు సహా డీఈఈ, ఏఈఈలు పరిశీలించారు. 3,850 క్యూసెక్కులు నీటిని ఎత్తిపోస్తే సాఫీగా నీటి ప్రవాహం ఉంటుందా..? సింగిల్‌లైన్ రోడ్డు బిడ్జిల వద్ద ఏమైనా సమస్యలు తలెత్తుతాయా? పంపింగ్ స్టేషన్ల వద్ద ఉన్న ఇబ్బందులు తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం సంకల్పం సాకారం చేసే దిశగా పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు అప్రమత్తంగా ఉన్నారని సీఈ నాగరాజు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



నానో ఎరువులతో లాభాలెన్నో..!

వ్యవసాయం సులభతరంగా, లాభసాటిగా మార్చడానికి నూతన ఆవిష్కరణలు ఊతమిస్తాయి. ఈకోవలేనే రూపుదిద్దుకున్న నానో సాంకేతికత ఎరువుల తయారీలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది. యూరియా, డీఏపీలు 'నానో ఎరువులు'గా ద్రవరూపంలో అందుబాటులోకి వచ్చాయి. రసాయనిక ఎరువుల గుళిక మందులను నివారించేందుకు ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. అధిక మోతాదులో యూరియా, రసాయనిక ఎరువులు వాడొద్దని, వాటి స్థానంలో నానో యూరియా, డీఏపీ వాడటంతో తక్కువ ఖర్చుతో పొలాలకు సత్తువనిస్తుందని అవగాహన కల్పిస్తున్నారు.



ఆదోని డీసీఎంఎస్ కేంద్రంలో అందుబాటులో ఉన్న నానో యూరియా

- యూరియా కొరతను తీర్చేందుకు నానో ఎరువు
- తక్కువ ఖర్చుతో పొలానికి సత్తువ
- అధిక మోతాదును నివారించేందుకు వినూత్న ఆలోచన
- గుళికలకు బదులు పిచికారి మందు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువులతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. మోతాదుకి మించి రసాయనిక ఎరువులు వాడి తీవ్రంగా నష్టపోతున్నారు. క్రమక్రమంగా వాటిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నానో యూరియా, నానో డీఏపీ పిచికారి మందును రూపొందించేందుకు కంపెనీలకు అనుమతి ఇచ్చింది. వాటిని మార్కెట్లో విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో యూరియా, డీఏపీ వంటి ఎరువులకు డిమాండ్ పెరిగింది. పది రోజులుగా జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం ప్రాంతాల్లో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా మంది రైతులు అవగాహన లేక నానో యూరియా తీసుకునేందుకు మొగ్గు చూపడం లేదు.



నానో యూరియాను తీసుకెళ్తున్న రైతులు

ఖర్చు తగ్గించి..

కర్నూలు జిల్లాలో పత్తి, వేరుశనగ, వరి, ఉల్లి, మిరప, మొక్కజొన్న, కంది, పెసర, మినుము పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనేక రకాల రసాయన ఎరువులను కొనుగోలు చేస్తూ పంటలకు వాడుతున్నారు. ఈఎరువులు యాభై కేజీ బస్తాల్లో ఉండడంతో వాటిని దూరప్రాంతాల్లోని పొలాల్లోకి తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు రసాయన ఎరువులను పరిమితంగా వాడడంతో పాటు ఎరువులను పొలాలకు సులువుగా తరలించేందుకు వీలుగా ఉండే నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించేలా అందుబాటులో ఉంచింది. బస్తాలను మోసేపని తగ్గుతుందని సూచించినా అవగాహన లేకపోవడంతో వీటిని తీసుకెళ్లేందుకు జంకుతున్నారు. కొద్దికాలంగా నానో ఎరువులను వినియోగంతో కలిగే లాభాలపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. కొందరు రైతులు ఇప్పుడిప్పుడే నానో ఎరువులను వాడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సులభంగా తరలించొచ్చు

మార్కెట్లో యాభై కేజీల యూరియా బస్తా ధర రూ.266, డీఏపీ యాభై కేజీల బస్తా ధర రూ. 1,350 ఉండగా కొందరు వ్యాపారులు యూరియా రూ.350, డీఏపీ రూ. 1400కు అనధికారంగా అమ్ముతున్నారు. వీటిని పొలాల వద్దకు చేర్చేందుకు అదనంగా మరో వంద రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నానో యూరియా 500 మిల్లీలీటర్లు ధర రూ. 225, నానో డీఏపీ ధర రూ.600 మాత్రమే కాక వీటిని సులభంగా తరలించవచ్చు. ఎకరానికి రెండుసార్లు పిచికారి చేసుకోవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

నానో ఎరువులపై అవగాహన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానో ఎరువులపై అవగాహన కల్పించాలని సూచించాయి. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే విధంగా ప్రభుత్వం నానో యూరియా, డీఏపీ పిచికారి మందులకు అనుమతించింది. నానో డీఏపీ, యూరియాను డీసీఎంఎస్ కేంద్రాలతో పాటు పలు డీలర్లు వద్ద అందుబాటులో ఉంచాం.

- జీవి సుధాకర్, మండల వ్యవసాయాధికారి, ఆదోని

జీడీపీకి నీటి విడుదల

- హంద్రీనీవా నుంచి 70, ఎల్లెల్సీ నుంచి 55 క్యూసెక్కులు
- రెండు రోజుల్లో ప్రాజెక్టుకు చేరే అవకాశం
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

గోనెగండ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కి నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. హంద్రీనీవా నుంచి జీడీపీకి నీటిని విడుదల చేయమని రెండు రోజుల క్రితం కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు హంద్రీనీవా నుంచి గురువారం 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీరు ఆదివారం కానీ, సోమవారం ఉదయం ప్రాజెక్టుకు చేరనున్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జీడీపీలో కేవలం ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఎల్లెల్సీ నుంచి గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా రోజుకు 55 క్యూసెక్కుల నీరు జీడీపీ విడుదల అవుతున్నాయి. హంద్రీనీవా, ఎల్లెల్సీనీరు వచ్చి జీడీపీని చేరుతుండటంతో ఇక తాగునీటి పథకాలైన బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, లకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. వచ్చే రబీసీజన్‌కు కూడా 10వేల నుంచి 12వేల లోపు ఎకరాలు సాగునీరు అందే అవకాశాలు మెరుగుపడ్డాయని జీడీపీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రడ్యాంలో 80 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని నిలువ చేయరాదని అధికారులు ప్రకటించడంతో కర్నూలు నగరానికి వేసవి కాలంలో తాగునీరు అందించే సుంకేసుల జలాశయంలో తగినంత నీటి నిలువ ఉంచే పరిస్థితి ఉండదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో కర్నూలు నగరంలో ఉన్న ప్రజలకు వచ్చే వేసవిలో నీటి కష్టాలను తీర్చేందుకు గాను జీడీపీలో నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో వినియోగించుకోవడం కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.



గాజులదిన్నె ప్రాజెక్టులో నిల్వ ఉన్న ఒక టీఎంసీ నీరు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

- 188 మంది విద్యార్థులు హాజరు
- నలుగురు గైర్హాజరు
- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



సెయింట్ క్లారెట్ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ క్లారెట్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్(మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల)లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకై నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పర్యవేక్షించారు. మొత్తం విద్యార్థులు 192 మందికి గానూ 188 మంది హాజరు కాగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కొనసాగింది. పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, గురుకులాల కో-ఆర్డినేటర్ పరిశీలించారు.

ఐదేళ్ల పాలనలో అరాచకాలే

- కల్తీతో మద్యం తాగి మతిభ్రమించిన వైసీపీ నాయకులు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- పత్తికొండలో 'తొలి అడుగు'

పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలన అరాచకాలతోనే కొనసాగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. శుక్రవారం పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలసి ఆయన 'తొలి అడుగు'లో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందుతున్నాయా.. లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ప్రజలకు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. 6లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో కల్తీ మద్యం అమ్మిన వైసీపీ నాయకులు ఆ మద్యం దాచుకుని పగలు రాత్రి తాగుతూ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ మరింత రెచ్చిపోయి చంపుతాం, నరుకుతాం అంటూ మాట్లాడుతున్నారన్నారు. అహంభావం, అహంకారాలే వైసీపీ పతనానికి కారణమని, ఆ పార్టీ నాయకులు మాట్లాడిన బూతు పురాణాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.



బోయబొంతి రాళ్లలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఇళ్లు.. ఎన్నేళ్లు..!



తాగునీటి కోసం ఇలా ట్యాంకులు కట్టి వదిలేయడంతో ఊడిపోతున్న కొళాయిలు

5వ పేజీ తరువాయి

దీనికితోడు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యం లేకపోవడంతో పేదలు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఆదోని శివారులో డాణాపురం దగ్గర ఆదోని పట్టణ ప్రజలకు 6,495 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టి 4,286 ఇళ్లు పూర్తి చేశామని రికార్డుల్లో చూపుతున్నారు. ఇప్పటికే రూ.100.14 కోట్లు ఖర్చు చేశారు. అక్కడ కూడా నాలుగు గోడలు, ఆర్‌సీసీ స్లాబ్ వేసి వదిలేశారు. ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో ఒక్కటే కాదు.. కర్నూలు నగరం సహా ముప్పాతిక శాతం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

పీఎంఏవై (అర్బన్, గ్రామీణ) ఇళ్ల పురోగతి వివరాలు			
వివరాలు	అర్బన్	గ్రామీణ	మొత్తం
మంజూరు చేసిన ఇళ్లు	39,440	14,527	53,967
నిర్మాణాలు మొదలైనవి	39,410	10,622	50,032
పూర్తైన ఇళ్లు	24,766	4,642	29,408
వివిధ దశల్లో ఉన్నవి	14,731	5,980	20,711
చేసిన ఖర్చు (రూ.కోట్లల్లో)	533.58	68.11	601.69

ఇసుక గూళ్లు!

గత జగన్ ప్రభుత్వ హయాంలో ఆప్షన్-3 కింద ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు పట్టణాల్లో దాదాపు 10,138 ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. 85 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని ఆ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థలు చెబుతున్నాయి. ఆ సంస్థలకు రూ.77-80 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. లబ్ధిదారులు కుటుంబంతో నివాసం ఉండేదుకు వీలుగా ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేయలేదు. నాలుగు గోడలు కట్టి, ఆర్‌సీసీ స్లాబ్ వేసి, బయట గోడలకు ఒక్కటే సిమెంట్ ప్లాస్టింగ్ చేసి వదిలేశారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యమైన సిమెంట్ ఇటుకలు వాడలేదని తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాలపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆదోనిలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యేగా గెలిచిన మొదట్లో చెప్పిన ఆయన ఇప్పటికీ చర్యలు లేవు. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లతో తనిఖీ చేయించాలని, నాణ్యతాప్రమాణాలు విస్మరించినట్లు తేలితే కాంట్రాక్ట్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లక్ష్యం మేరకు పురోగతి

కర్నూలు జిల్లాలో పేదలకు 53,967 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 50,032 ఇళ్లు నిర్మాణాలు మొదలు పెట్టి 29,408 ఇళ్లను పూర్తి చేశాం. వివిధ దశల్లో ఉన్న ఇళ్లలో 11,706 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కర్నూలు కలెక్టరు పి.రంజిత్‌బాషా క్రమం తప్పకుండా పురోగతిపై సమీక్షిస్తున్నారు. గడువులోగా నిర్మాణాలు పూర్తి పేదలకు అప్పగిస్తాం.

- చిరంజీవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, గృహ నిర్మాణ శాఖ, కర్నూలు

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

- ఏఐబీఎస్ఎన్ఎల్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు
- కర్నూలులో ఉద్యోగుల ధర్నా



నిరసనలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు వ్యతిరేకంగా మార్చి 2025 తేదీ ఆర్థిక బిల్లులో ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ.రామాంజనేయులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్వర్యంలో శ్రీనివాసనగర్ టెలిఫోన్ ఎక్చేంజ్ వద్ద మానవహారం నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టంతో పాత, కొత్త పెన్షన్‌దారులకు వేరు చేస్తూ పెన్షన్ రివిజన్ 2026లో రిటైర్ అయ్యే వారికి వర్తించే విధంగా, డిసెంబరు 2025 కంటే ముందుగా రిటైర్ అయ్యేవారికి వర్తించదని చట్టం చేయడం జరిగిందన్నారు. వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జే.వెంకట రమణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామదాసు, ఏఐబీడీ పీఏ అసోసియేషన్ నాయకులు యాకోబు, మహేశ్వర రావు, ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ నాయకులు జే.వెంకటరమణ, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే పీడీయాక్ట్


ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

నంద్యాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నంద్యాలలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పీడీ యాక్ట్ నమోదు చేసినా మార్పురాని వారి వివరాలను వెల్లడించారు. పాణ్యం మండల కేంద్రానికి చెందిన మానిపాటి రాజు అనే వ్యక్తి సారా విక్రయిస్తూ అనేక సార్లు పట్టుబడడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి సెంట్రల్ జైల్‌కు పంపామన్నారు. జిల్లాను నాటుసారా రహితంగా మార్చడానికి నవోదయం.2 కార్యక్రమాన్ని అన్ని శాఖలతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 199 గ్రామాలకు గానూ 71 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా చేసినట్లు తెలిపారు. త్వరలో మరో 30 గ్రామాలను మార్చుతామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 48,850 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 8,770 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా విక్రయిస్తున్న 458 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. సారా విక్రయిస్తూ మార్పు రాని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.3.75 లక్షలు జరిమానా వసూలు చేశామన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ లక్ష్మణదాసు, సీఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోడెల రాముడు



బల రాముడు



అడవి రాముడు

- ఆ రైతుకు ఎద్దులపై మమకారం
- పందెం కోడెలను పెంచుతున్న శ్రీరాములు

కోడుమూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆ రైతుకు ఎద్దులంటే ప్రాణం. వాటి పోషణలో ఖర్చుకు వెనుకంజ వేయడం లేదు. కన్నబిడ్డల కంటే అపురూపంగా ఆ ఎద్దులను పెంచుకుంటున్నాడు కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు అనే రైతు. గత 15 ఏళ్ల నుంచి కోడె దూడలను పెంచుతున్నాడు. ఈ రైతుకు ఐదెకరాల సొంత పొలం ఉంది. దీనికి అదనంగా మరో 20 ఎకరాలను కౌలుకు చేస్తున్నాడు. వ్యవసాయ పనుల్లో కోడె దూడలను వినియోగిస్తూనే, రాతిదూలం లాగే పోటీలకు తరలిస్తున్నాడు. రైతు శ్రీరాములు గతంలో కొనుగోలు చేసిన దూడల్లో ఒకదానికి బలరాముడు, మరోదానికి అడవి రాముడు అని పేర్లు పెట్టి పిలుస్తున్నాడు. ఇందులో బలరాముడును రూ.1.80 లక్షలకు కొనుగోలు చేయగా అడవి రాముడును రూ.లక్షకు కొనుగోలు చేశాడు. ఇప్పుడా కోడెలు రూ.13 లక్షలు, రూ.10లక్షలకు విక్రయించాలని అడుగుతున్నా.. వాటిని విక్రయించేందుకు రైతు శ్రీరాములు అమ్మడానికి ఇష్టపడటం లేదు. పందెం పోటీలకు తలపడుతున్న కోడెదూడలకు గ్రాసంతో పాటు దాణా, ఉలవలు, ఖర్జూరం, బాదం, బీట్‌రూట్, క్యారెట్, ఎండుకొబ్బరి, బీన్స్ వంటి పోషకాహారం అందిస్తున్నాడు. వాటి పోషణకు నెలకు దాదాపు రూ.20వేలు ఖర్చు చేస్తున్నాడు. పందెం పోటీల్లో గెలుపొందిన నగదుతో పాటు సొంతంగా ఖర్చు చేస్తూ ఎద్దులను కంటికి రెప్పలా చూస్తున్నాడు.



ఎద్దులపై మమకారం ఇప్పటిది కాదు

మాతాతల కాలం నుంచి పశుపోషణ చేస్తున్నాం. వ్యవసాయంలో ఎద్దుల సహకారానికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. వారసత్వంగా పశువుల పెంపకంపై ఇష్టం ఏర్పడింది. గత 15 ఏళ్ల నుంచి పందెం ఎద్దులను పెంచుతున్నాను. పోటీల్లో సాధించే విజయం ఎంతో గర్వకారణంగా నిలుస్తోంది. నాతో పాటు గ్రామానికి కూడా మంచి పేరు వస్తోంది. - శ్రీరాములు, క్రిష్ణాపురం

గంజాయి రవాణాను అరికట్టాం

- పోలీస్ శాఖపై నిందలు వేస్తే సహించం
- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపి దాదాపుగా నివారించగలిగామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పోలీసు డిపార్టుమెంట్‌ను, పోలీసు అధికారులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని.. కొన్ని పత్రికా మాధ్యమాలలో దూషించడం, తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు. తమపై, పోలీసుశాఖపై వస్తున్న అసత్యప్రచారాలపై స్పందించకపోతే ప్రజలు అవే నిజమని భావిస్తారన్నారు. అందుకే తాను మీడియా ముందుకు వచ్చానని తెలిపారు. తాను విశాఖపట్నం జిల్లా ఎస్పీగా 2014-16 మధ్య కాలంలో పనిచేశానన్నారు. ఆ సమయంలో విశాఖపట్నం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేదన్నారు. నక్సల్స్ ప్రాబల్య ప్రాంతాల్లో గంజాయి సాగు అనేది విచ్చలవిడిగా జరిగేదన్నారు. గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆ రోజున్న పరిస్థితుల్లో పోలీసులు గంజాయి సాగు ప్రాంతాల్లో ప్రవేశించి గంజాయి తోటలను ధ్వంసం చేసే పరిస్థితి ఉండేది కాదని, అందువల్ల గంజాయి రవాణా మార్గాలను టార్గెట్ చేశామన్నారు. అక్కడ పని చేసిన రెండు సంవత్సరాల పాటు లక్ష కిలోల వరకు గంజాయిని జప్తు చేశామన్నారు. కాకినాడ పోర్టులో డీజిల్ దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగేవని అక్కడ పని చేసే కాలంలో వాటన్నింటినీ అరికట్టామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు లేకపోయినా కూడా తమ పర్యవేక్షణలో ఉన్న ప్రదేశాలలో అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా నిర్మూలించామన్నారు. పోలీస్ శాఖపై నిందలు వేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఐజీ స్పష్టం చేశారు.

ఆగస్టు 13న తాత్కాలిక కార్యవర్గం ఏర్పాటు

నంద్యాల కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వడియరాజుల సత్రం నిర్వహణలో వచ్చిన అభిప్రాయ భేదాల దృష్ట్యా తాత్కాలిక కార్యనిర్వహక వర్గాన్ని ఆగస్టు 13వ తేదీన ఏర్పాటు చేయనున్నట్లు శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశము నిర్వహించేందుకు దేవస్థాన ఉపకార్య నిర్వహణాధికారి రమణమ్మ, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజనీరు బాలమురళీకృష్ణ, పర్యవేక్షకులు శివప్రసాద్, మల్లికార్జునను సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 13వ తేదీ ఉదయం 11గంటలకు శ్రీశైల క్షేత్రంలో వడియరాజుల సత్రం తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

బస్సు, బైకు ఢీ


బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

బండిఆత్మకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలోని ఏ కోడూరు దర్గా సమీపంలో మలుపు వద్ద ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న బైక్, నంద్యాల నుంచి నారాయణపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డు సైడ్‌కు మళ్లించటంతో ద్విచక్ర వాహనదారుడికి స్వల్పగాయాలు కాగా, బస్సులో ఉన్న కొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. బస్సు కాస్త ముందుకెళ్లి గుంతలోకి దిగి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు పోలీసులు చేరుకుని బస్సును పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఏఎల్ డిమాండ్



బార్ అసోసియేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) శుక్రవారం డిమాండ్ చేసింది. ఐఏఎల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు బార్ అసోసియేషన్ ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.10 లక్షలకు పెంచాలని, న్యాయవాదుల రక్షణ బిల్లును వెంటనే ఆమోదించి న్యాయవాదులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, కోశాధికారి దస్తగిరి, సీనియర్ న్యాయవాదులు చంద్రుడు, మాసిపోగు సుబ్బయ్య, కె.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

మంత్రాలయం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కురువ పద్మావతి(36)అనే మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. పద్మావతి ఈనెల 23న ఇంటినుంచి వెళ్లిపోయింది. కనిపించకపోవడంతో బంధువులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం వగరూరు చెరువులో పద్మావతి మృతదేహం లభ్యమైంది. పద్మావతికి 15ఏళ్ల క్రితం పెద్దకడబూరు మండలం కమ్మలదిన్నె గ్రామానికి చెందిన కురువ నాగేంద్రతో వివాహమైంది. వీరికి సంతానం లేరు. ఆమె భర్త నాగేంద్ర 12 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఒంటరిగా ఉన్న పద్మావతి తన పుట్టినిలైన వగరూరులో ఉంటోంది. 7నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం చెరువులో పద్మావతి మృతి తేలియాతుండడం చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మహిళ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్లు త్రీటౌన్ ఎస్ఐ రామస్వామి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కేవీఆర్ కాలనీకి చెందిన వెంకటేశులు, శాంతమ్మ దంపతుల కుమారుడు వన్నయ్య(32). బేల్దారి పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. శుక్రవారం ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నూతన గృహ నిర్మాణంలో భాగంగా లిఫ్ట్ ద్వారా ఇటుకలను పంపుతున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుర్తించిన తోటి కార్మికులు హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సంధ్య ఉంది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని 16వ వార్డులో నివసిస్తున్న గోకారమ్మ చిన్నకుమారుడు ఇమాంవలి (23) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని తెలిసింది. ఆత్మహత్యపై తమకు సమాచారం అందలేదని విచారిస్తామని సీఐ జయన్న తెలిపారు.

పాలకొలనులో మిస్సైల్ ప్రయోగం

రక్షణ రంగంలో మరో ముందడుగు

- యూఎల్‌పీజీ-వీ3 పరీక్షలు విజయవంతం
- దేశీయంగా సరికొత్త టెక్నాలజీతో సత్తా

ఓర్వకల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ రంగంలో మరో అడుగు ముందుకు పడింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామ సమీపాన గల డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) ద్వారా శుక్రవారం ప్రతిష్టాత్మకంగా చేసిన క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. మన దేశంలోనే తయారైన ఓ మిస్సైల్‌ను యూఏవీ లంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ (యూఎల్‌పీజీ-వీ3)కి సంబంధించిన పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఉన్న నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌వోఏఆర్)లో డ్రోన్ నుంచి మిస్సైల్‌ను ఏ సమస్య లేకుండా డీఆర్‌డీవో విజయవంతంగా ప్రయోగించిందని రక్షణ శాఖ తెలిపింది. గతంలోనూ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ సిస్టమ్‌ను పరీక్షించేందుకు ఇక్కడే ప్రయోగాలు చేశారు.



పాలకొలను లోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌వోఏఆర్)


నూతనంగా డ్రోన్ ద్వారా ప్రయోగించిన క్షిపణి

రక్షణ రంగంలో మైలురాయి


- రాజ్‌నాథ్‌సింగ్, భారత రక్షణ శాఖ మంత్రి



డీఆర్‌డీవో ద్వారా చేసిన డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం విజయవంతం రక్షణ రంగంలో మరో మైలురాయి అని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఢిల్లీ నుంచి సోషల్ మీడియా ద్వారా తెలిపారు. మోడ్రన్ మిస్సైల్ వ్యవస్థను రూపొందించడంలో విజయవంతంగా పరీక్షించినందుకు డీఆర్‌డీవో, ఆ సంస్థ భాగస్వాములైన డిఫెన్స్ క్యాపిటల్ ప్రొక్యూర్‌మెంట్ పార్టనర్స్ (డీసీపీపీలు), మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈలు), స్టార్టప్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. దేశీయంగా సరికొత్త టెక్నాలజీతో ఆత్మనిర్భర్ భారత్ ద్వారా సత్తా చాటడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం దేశంలో అత్యాధునిక రక్షణ ఆవిష్కరణలలో స్వదేశీ టెక్నాలజీ పెరుగుతుందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు గర్వంగా ఉంది

- సీఎం చంద్రబాబునాయుడు



కర్నూలు జిల్లాలోని డీఆర్‌డీవో ద్వారా డ్రోన్ నుంచి మిస్సైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తంచేశారు. భారతదేశ రక్షణ పర్యావరణ వ్యవస్థ వృద్ధికి దోహదపడటం ఆంధ్రప్రదేశ్‌కు గర్వంగా ఉందని కొనియాడారు. క్షిపణి పరీక్ష విజయవంతం చేసిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు అభినందనలు తెలిపారు. దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమైన ముందడుగు అని చంద్రబాబు అభివర్ణించారు. యూఎల్‌పీజీ-వీ3 విజయం ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు.

ఏపీకి మరో ఘనత: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఓర్వకల్లు మండలంలోని డీఆర్‌డీవో నిర్వహించిన క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంపై ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం రాష్ట్రానికి మరో ఘనత సాధించి పెట్టిందన్నారు. గతంలోనూ దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికైన క్షిపణితో రెండున్నర కిలోమీటర్ల దూరంలోని యుద్ధ ట్యాంకును ధ్వంసం చేసే ప్రయోగాన్ని డీఆర్‌డీవో విజయవంతంగా పూర్తిచేసిందన్నారు. డీఆర్‌డీఓతో పాటు, అనుబంధ రక్షణ సంస్థల శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

పాలకొలనుకు జాతీయ స్థాయిలో గుర్తింపు



పాలకొలను సమీపంలో ఏర్పాటు చేసిన డీఆర్‌డీవో సంస్థ ద్వారా గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. డీఆర్‌డీవో ద్వారా నిర్వహించిన క్షిపణుల ప్రయోగాలన్నీ విజయవంతం కావడం హర్షించదగ్గ విషయం. సంస్థ ఏర్పాటుకు సాగు భూములిచ్చిన గ్రామ రైతులందరికీ కృతజ్ఞతలు.

- చదువుల సుజాతమ్మ, సర్పంచ్, పాలకొలను


హంద్రీనీవానీటికి జలహారతి ఇస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

సీమను సస్యశ్యామలం చేస్తాం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- 68 చెరువులకు నీటివిడుదల
- కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలు కోట్ల, కేఈ

పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అన్ని ప్రాంతాలకు కృష్ణాజలాలను తరలించి సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. ఈ మేరకు కృష్ణగిరి మండలంలోని ఆలంకొండ వద్ద పంప్‌హౌస్ నుంచి హంద్రీనీవా ద్వారా 68 చెరువులకు నీటిని మంత్రితో పాటు డోన్, పత్తికొండ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కేఈ శ్యాంబాబులు విడుదల చేశారు. తొలిరోజు 80 క్యూసెక్కుల నీటిని అధికారులు చెరువులకు మళ్లించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాయలసీమను సస్యశ్యామల ప్రాంతంగా చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పించారన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాల్లోని చెరువులకు కృష్ణా జలాలతో నింపడం సాధారణ విషయం కాదన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ముందుచూపుతో చేసిన ఆలోచన ఇప్పుడు కరువు పల్లెలకు వరమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబి, నాయకులు ఎల్వీ ప్రసాద్, మర్రి శ్రీరాములు, దామోదర్‌నాయుడు, గురుస్వామి, మహమ్మద్ రఫి తదితరులు ఉన్నారు.

చేయాల్సింది ఎంతోఉంది : కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే

68 చెరువులకు నీటిని నింపడంతో అనుకున్న పని పూర్తి కాలేదు. ఆ చెరువుల నుంచి పిల్ల కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరాలి. కుంటలకు నీటిని నింపుకోవాలి. భవిష్యత్‌లో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించే రోజు రావాలి. మా నాన్న కేఈ కృష్ణమూర్తి నాడు ప్రారంభించిన ఈయజ్ఞం నేను ఎమ్మెల్యేగా ఉన్నరోజున పూర్తికావడం ఆనందంగా ఉంది.

అంతా మంచే జరుగుతుంది
- కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

మాది ప్రజల కోసం పనిచేసే మంచి చేసే ప్రభుత్వం. ఈ ప్రభుత్వంలో అంతామంచే జరుగుతుంది. డోన్ నియోజకవర్గంలో అన్ని చెరువులను నింపుతాం. డోన్‌ను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాన్ని నిధులు మంజూరు చేయాలని కోరాం. నిధులు మంజూరైన వెంటనే పనులు త్వరితగతిన చేపడుతాం.

ఇరువర్గాలపై కేసు నమోదు

సి.బెళగల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామంలో గురువారం ఘర్షణపడ్డ ఇరువర్గాలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆచారి తెలిపారు. మారందొడ్డి గ్రామంలో రుక్మాంగద ఇంటిపై రాళ్లతో దాడిపాల్పడిన వెంకటేశ్వర్లు, మోహన్‌నాయుడు పైతో పాటు రుక్మాంగద వర్గీయులపై కేసు నమోదు చేశామన్నారు.

బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం



ఆస్పరిలో నగదు మాయమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఆస్పరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆస్పరి ఎస్‌బీఐ బ్యాంకులో క్రెడిట్ కార్డులున్న ఖాతాలో నగదు మాయమవుతున్నట్లు శుక్రవారం బాధితులు గోపాల్‌రెడ్డి, పురుషోత్తం, బసవరాజు, ఈరన్న, సురేం ద్ర వాపోయారు. ఒక్కో ఖాతా నుంచి వేలాది రూపాయలు మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న గోపాల్‌రెడ్డి ఖాతా నుంచి రూ.43 వేలు, చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతు బసవరాజు ఖాతాలో రూ.26 వేలు, ఆస్పరి గ్రామానికి చెందిన పురుషోత్తం ఖాతాలో రూ.12 వేలు నగదు మాయమైనట్లు తెలిపారు. మండలంలో సుమారు క్రెడిట్ కార్డులున్న 100 ఖాతాల నుం చి నగదు మాయమైనట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని తా ము బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పొంతనలేని సమాధానం చెబుతున్నాడన్నారు. మీరు బయట చూసుకోవాలి గానీ బ్యాంకుకు సంబంధం లేదని చెబుతున్నాడని బాధితులు వాపోయారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

దేవనకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమదంలో దేవనకొండకు చెందిన వడ్ల రాజు (42) మృతి చెందాడు. పని నిమిత్తం దేవనకొండ నుండి టర్నింగ్ (క్రాస్‌రోడ్డు)కు బైక్‌పై వెళ్తుండగా ఈద్గా వద్ద బైక్‌కు వ్యక్తి అడ్డు రాగా, తప్పించబోయి ప్రమాదం చోటుచేసుకొంది. ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో పత్తికొండకు తరలించగా, మార్గమధ్యంలో మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కుమారులు, కుతూరు ఉన్నారు.

లక్ష్యం మేరకు చేపల పెంపు

- సుంకేసులలో రూ.1.30 కోట్లు చేపగుడ్లు
- మత్స్యశాఖ డీడీ దామోదర్‌రావు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో లక్ష్యం మేరకు చేప పిల్లలను పెంచేందుకు చర్యలు చేపట్టామని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చేప పిల్లల కేంద్రాల్లో అవసరమైన చర్యల చేపట్టామన్నారు. కర్నూలు జిల్లాలోని 3 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలైన కర్నూలు, సుంకేసుల, గాజులదిన్నె కేంద్రాల్లో 70 లక్షల చేప పిల్లలు, అదే విధంగా నంద్యాల జిల్లాలోని ఒకే ఒక సీడ్ ఫారంలో 25 లక్షల చేపల పిల్లలు మొత్తం 95 లక్షల చేప పిల్లల ఉత్పత్తిని చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఆ దిశగా కర్నూలు జిల్లాలోని మూడు ఫారాల్లో మరమ్మతుల పనులు పూర్తి చేయడం జరిగిందని కర్నూలు ఫిష్ ఫీడ్ పెంపకం కేంద్రానికి కేసీ కాలువ నీటిని తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆ నీరు కొంచెం విడుదలైన తర్వాత సిమెంట్ తొట్లలో నింపడం జరుగుతుందని మురుగునీరు ఆ తొట్లలో చేరికతో చేపపిల్లలు చనిపోయే అవకాశం ఉందన్నారు. అదే విధంగా మూడు రోజుల గుడ్డు పిల్లలను ఏలూరు జిల్లా బాదంపూడి నుంచి కానీ, నిడ్ పెన్నార్ డ్యాంతో పాటు అనంతపురం సీడ్ ఫారాల నుంచి తీసుకురావాల్సి ఉందని డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ రావు తెలిపారు. అక్కడ చేప విత్తనం అందుబాటులో ఉన్నప్పుడు తీసుకుని వచ్చి జిల్లాలోని గాజులదిన్నెతో పాటు కర్నూలు నగరంలోని చేప పిల్లల కేంద్రాల్లో నిల్వ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఇప్పటికే సుంకేసుల ఫారంలో 1.30 కోట్ల చేప గుడ్డు పిల్లలను నిల్వ చేయడం జరిగిందన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

● జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజా రఘువీరా

● సి క్యాంపు రైతు బజారులో తనిఖీలు


ఉల్లిగడ్డలను పరిశీలిస్తున్న డీఎస్‌వో రాజా రఘువీరా

కర్నూలు అగ్రికల్చర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సి.క్యాంపు రైతుబజారులో నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకే లభిస్తాయనే ఆశతో ప్రజల వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యావసర వస్తువులు అందించాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజా రఘువీరా అన్నారు. నగరంలోని సి.క్యాంపు రైతుబజారును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కిరాణ అంగళ్లతోపాటు కూరగాయలు విక్రయిస్తున్న స్టాల్స్‌ను డీఎస్‌వో పరిశీలించారు. ఆయన వెంట సి.క్యాంపు రైతుబజార్ ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.

ఆడబిడ్డ నిధి హామీని అమలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆడబిడ్డ నిధి హామీని అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడబిడ్డకి నిధి పేరుతో ప్రతి నెల రూ.1500 ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షురాలు పావని, నాయకులు కోటమ్మ, సులోచనమ్మ, సుధా, ఆశా బేగం, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌యూ వీసీని రీకాల్ చేయాలి

కర్నూలు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) ఉపకులపతి వి.బసవవెంకటరావు రీకాల్ చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌యూలో పాలక మండలి గోప్యత పాటించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. పాలక మండలిలో ఉపకులపతి తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలు బహిర్గతం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. స్థానిక ప్రొఫెసర్లు, విద్యార్థులను పక్కన పెట్టి సొంత అజెండా అమలు చేస్తే కుదరదన్నారు.

పుట్టినబిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని, దీంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.తాండ్రపాడు ఆయుష్మాన్ మందిర్‌లో జరుగుతున్న సంచార చికిత్సను ఆయన తనిఖీ చేశారు. పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, వేసవిలో పిల్లలకు మంచినీరు, ద్రవ పదార్థాలు ఇవ్వకూడదని అన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి పర్యవేక్షకురాలు ఎస్తేర్‌రాణి, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెడుతోన్న సీఎం

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

● వీకర్‌సెక్షన్ కాలనీలో 'తొలి అడుగు'


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అన్ని రంగాలు ధ్వంసమయ్యాయని, సీఎం చంద్రబాబు తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శుక్రవారం 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్‌బేగం, వార్డు ఇన్‌చార్జి నాగేశ్వరరావు, జవ్వాజి గంగాధర్‌గౌడ్, రాఘవేంద్ర ఆచారి, గాంధీ, షేక్షావలి, కురువ ధనుంజయ, లక్ష్మీనారాయణ, పీజీ వెంకటేష్, కె.మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు కృషి: ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్: రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం ఈ.తాండ్రపాడులో శుక్రవా రం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి తిరిగి స్థానికులకు కరపత్రాలను అందిస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు: సోమిశెట్టి

కర్నూలు అర్బన్: సీఎం చంద్రబాబు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని అమలు చేయబోతున్నారని, ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నగరంలోని 26వ వార్డు లక్ష్మీనగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు వివరించారు. టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర సివిల్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, మహిళలు పాల్గొన్నారు.


లక్ష్మీనగర్‌లో కరపత్రాన్ని అందిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కోడుమూరు రూరల్: ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని అమడగుంట్లలో సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ప్రజలకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో సురేష్, రమేష్, శ్రీనివాసరెడ్డి, అమీన్, రంగస్వామి, మధునాయుడు, రవికు మార్, రవికిషోర్, శీను పాల్గొన్నారు.

గూడూరు: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, నాయకులు డాక్టర్ మన్నన్ బాషా, నాగప్ప యాదవ్, కురువ హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వీరకుమార్, చాంద్‌బాషా, సోలేమాన్, అక్కలదేవి గిడ్డయ్య పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీ నంబర్లును తొలగించాలి

● రైతులకు న్యాయం చేయాలి

● కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి


మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

సి.బెళగల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు రైతుల జాయింట్ ఎల్‌పీ నంబర్లు తొలగించాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చింతామనుపల్లె ఎత్తిపోతల పథకం మోటార్ల స్విచ్ ఆన్‌చేశారు. సంగాల గ్రామంలో మహిళా రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందుతున్నాయా అని మహిళా రైతులు తులసమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీ నంబర్లు లింకు కావడంతో తమకు 'తల్లికి వందనం' రాలేదని వారు తెలిపారు. రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించడానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి వెంటనే తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సంగాల గ్రామం నుంచి కొంతమంది రైతులను పంపుతాను జాయింట్ ఎల్‌పీ నంబర్లును తొలగించి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రైతుల సంక్షేమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎల్లెల్సీ అధికారులు, ఎంపీడీవో రాణెమ్మ, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, మండల కన్వీనర్ చంద్రశేఖర్, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా పీ-4 గ్రామసభ

● నిబంధనలు పాటించని అధికారులు

● నిలదీసిన సీపీఎం నాయకులు



సర్పంచు అధ్యక్షతన గ్రామసభను నిర్వహిస్తున్న అధికారులు

కోడుమూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పీ-4 గ్రామ సభను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాగ్యరత్న అధ్యక్షతన ఈ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ప్రజలు, పార్టీ నాయకులు, కనీసం వార్డు సభ్యులు కూడా లేకుండా గ్రామ సభను ముగించారు. కనీస నిబంధనలు పాటించకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ప్రజలు, పార్టీల నాయకులు విమర్శించారు. ఎలాంటి సమాచారం అందించకుండా గ్రామసభను నిర్వహించడంపై టీడీపీ, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ నిబంధనలు పాటించకుండా గుట్టుగా ముగించుకోవడం ఏమిటని సీపీఎం నాయకులు గఫూర్‌మియా సభలో ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీవో రాముడు మాట్లాడుతూ గ్రామసభలకు ప్రజలు రావడం లేదని చెప్పారు. కలెక్టర్ ఇక్కడి అధికారుల వ్యవహారంపై విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

సీపీఐ మహాసభలకు తరలిరావాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న వేలాది మందితో జిల్లా పరిషత్ నుంచి పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామక్రిష్ణ హాజరవుతారన్నారు.

కర్నూలులో నాటక ప్రదర్శనలకు ప్రోత్సాహకం

● నాటక దర్శకుడు, జానపద కళారత్న కంభం పామిలేటి

● ఆకట్టుకున్న శ్రీచౌడేశ్వరి వైభవం నాటకం

కర్నూలు కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో నాటక ప్రదర్శనలకు మంచి ప్రోత్సాహకాలు లభిస్తుండటం అభినందనీయమని శ్రీచౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, నాటక దర్శకుడు కంభం పామిలేటి అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శ్రీచౌడేశ్వరి వైభవం నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో కంభం పామిలేటి మాట్లాడుతూ కర్నూలు జిల్లా తొగటవీర క్షత్రియ సేవా సంఘం, నందవరీక బ్రాహ్మణ సంఘం, దేవాంగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో తమకు ఈ నాటక ప్రదర్శనలకు అవకాశాలు కల్పించారని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నందవరంలోని చౌడేశ్వరి మాత జీవిత చరిత్రను తొలిసారిగా నాటక రూపంలో జిల్లా ప్రేక్షకులకు తెలియజేయడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం నిర్వాహకులు చింతా శ్రీనివాసులు, తొగట వెంకటేశ్వర్లు, పోలిశెట్టి రాజ్‌కుమార్, నందవరీక బ్రాహ్మణ సంఘం నిర్వాహకులు సుదర్శనరావు, సురేష్, దుర్గాప్రసాద్, అక్కెం విశ్వనాథ్, దేవాంగ సంఘం నాయకులు మాదం కొండయ్య, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకం : దివంగత పల్లేటి లక్ష్మీకులశేఖర్ రాసిన శ్రీ చౌడేశ్వరి వైభవం నాటకం ఆసాంతం ఆకట్టుకుంది. మూడు గంటల పాటు సాగిన ఈ నాటకంలో మోడి సుబ్బరాయుడు, డాక్టర్ ఎన్‌టీకే తిలక్, ఎంవీ నాగరాజు, వైకే చెన్న క్రిష్టారెడ్డి, రమణయ్య, మురళీధర్ ఆచారి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ యాదవ్, ఈశ్వరాచారి, కొత్తపల్లె శ్రీను, డాక్టర్ కేవీ నారాయణ, యశోద, డీహెచ్‌జే దేవసేన తదితరులు నటించారు. సంగీతం యడవల్లి కృష్ణమూర్తి సమకూర్చగా, పి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణ చేశారు.


శ్రీచౌడేశ్వరి వైభవం నాటకంలోని ఒక సన్నివేశం, చౌడేశ్వరి మాతగా నటి యశోద

పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ మరమ్మతులు పనులను మధ్యాహ్నం అధికారులు, సిబ్బంది పూర్తి చేసినట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన గ్రావిటీ పైపులైన్ కోసం సుమారు 60 మందితో జాతీయ రహదారిపై దాదాపు 130 అడుగుల వెడల్పులో, 20 అడుగుల లోతులో లీకేజీల కోసం తవ్వారన్నారు. గత మంగళవారం నుంచి లీకేజీలను గుర్తించేందుకు నగర పాలక సిబ్బంది, హైదరాబాద్‌కు చెందిన అనుభవజ్ఞులైన నిపుణుల సాయంతో రాత్రింబళ్లు శ్రమించారని కొనియాడారు. రెండు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తొలత భావించగా, అనూహ్యంగా 5 లీకేజీలు బయట పడటం కారణంగా అనేక ఆటంకాలు ఏర్పడటంతో కొంత అలస్యంగా పనులు పూర్తి చేశామన్నారు. సాయంత్రం నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా చేస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

● సంతోష్‌నగర్ వద్ద పూర్తైన పైపులైన్ మరమ్మతు పనులను నగర మేయర్ బీవై.రామయ్య పరిశీలించారు. నగర పాలక డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు పనులను మేయర్‌కు వివరించారు. ఆయన వెంట కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

కంట్రోల్ రూంను ఏర్పాటు: నగర పాలక కార్యాలయంలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ కంట్రోల్ రూంను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు ఉన్నారు.

● నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ప్రజలు ట్యాంకర్ల కోసం తమ స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శిని సంప్రదించాలని కమిషనర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ అడ్మిన్లు అందుబాటులో లేకపోతే నగర పాలక కార్యాల యంలో కంట్రోల్ రూం నెంబర్లు 9490137006, 8790270528, 8074872 865, 9014323001, 9885864412కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరవాసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీనివాస్, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ జయప్రకాశ్ సూచించారు. శుక్రవారం కృష్ణనగర్‌లోని టి.నరసింహయ్య గ్రంథాలయంలో, కిమ్స్ హాస్పిటల్, సీఐటీయూ ముజఫర్‌నగర్ కమిటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ వెల్‌సీన్ జోన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, టీసీ లక్ష్మమ్మ కుట్టుమిషన్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కంటి, గుండె పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, వైద్య నిపుణులు జయప్రకాశ్, శ్రీనివాస్, విశ్వభారతి వైద్యశాల రిటైర్డు ప్రిన్సిపాల్ ప్రభాకర్, సీపీఎం కార్యవర్గ సభ్యులు కె. సుధాకరప్ప, ఆర్. నరసింహులు, సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ హాజరయ్యారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎకో తదితర పరీక్షలను ఉచి తంగా నిర్వహించారు. అలాగే నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారి కి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాయలసీమ విద్యార్థి జేఏసీ సంఘాల నాయకులు డీఈవో శామ్యూల్‌పాల్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాయలసీమ విద్యార్థి జేఏసీ సంఘాల నాయకులు, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల ఆనంద్‌బాబు, కోనేటి వెంకటేశ్వర్లు, ఎద్దుపెంట అంజి, బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాసంస్థలకు చెల్లించే ఆర్‌టీఈ ఫీజును రూ.25వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్‌టీఈ విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు.

ప్రారంభమైన శ్రావణమాస పూజలు


కలశాలతో తరలివస్తున్న మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ హరిద్వారా వారి ఆధ్వర్యంలో 108 కుండముల గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని బళ్లారి రోడ్డులోగల శ్రీలక్ష్మీ నారాయణ కల్యాణ మంటపంలో ఆదివారం వరకు మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తొలి రోజు మహిళా భక్తులు తలపై కలశాలు, వాటిపై నారీకేళాలు పెట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాటాలు, కంచెరలతో భజనలు చేశారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

కర్నూలు హాస్పిటల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో అడ్మిషన్ అయిన రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని డైట్ కాంట్రాక్టర్‌ను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆక్సిజన్, డైట్ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఉండే ఆక్సిజన్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదే శించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి ఏడీ మల్లేశ్వరమ్మ, డైట్ కాంట్రాక్టర్ మురళీధర్ రెడ్డి, ఆక్సిజన్ కాంట్రాక్టర్ ఖలీద్ పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలను కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, విక్రమసింహారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. రుద్రరెడ్డి, చిన్న సుంకన్న, ఈశ్వర్‌నాయుడు, సాయికృష్ణ, మాధవి, తిరుమణి, లక్ష్మి, శేషు, లక్ష్మన్న, రాహుల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కల్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్య మని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శుక్రవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె పాణ్యం నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్ర సాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కిడ్స్‌వరల్డ్ పార్క్, షరాప్ బజార్, కాంగ్రెస్ పార్టీ ఆఫీసు, వడ్డెగేరి, రోజావీధి, ఎన్‌ఆర్.పేట, ప్రకాశ్ నగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నేడు జాబ్ మేళా

కోడుమూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్షావలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో సుమారు 10 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 18-35 సంవత్సవరాల వయస్సు ఉండి, పది నుంచి పీజీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హతకు సంబంధించిన ధ్రువ పత్రాలు, ఆధార్‌తో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

గడియారం ఆసుపత్రి తనిఖీ


గడియారం ఆసుపత్రిలో వసతులను పరిశీలిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. హాస్పిటల్ సీఎస్‌ఆర్‌ఎంవో టీసీహెచ్ డాక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, గడియారం ఆసుపత్రి మెడికల్ ఆఫీర్ డా.అమర్‌తో కలిసి సూపరిటెండెంట్ వైద్య సిబ్బంది సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పాతబస్తీలో అతి పురాతనమైన గడియారం ఆసుపత్రిని ఇటీవల కేడ్రాయ్ సహకారంతో మరమ్మతులు చేశారని, దీన్ని పరిశీలించి వసతుల గురించి అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. గడియారం ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయని, త్వరలో సేవలు ప్రారంభమవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు వైద్యుడు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్స్ కాలనీ భాష్యం పాఠశాలలో ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శంకర్‌శర్మ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో తాను బాగా చదువుకోవ డంతో నేడు ఉన్నత స్థానంలో ఉన్నానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో డాక్టర్ శంకర్‌శర్మ

షాదీఖానా అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

ఆలూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): షాదీఖానా అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని ఆలూరు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు కె.మహబూబ్‌బాషా, షాదీఖానా కమిటీ సభ్యులు రజాక్ శుక్రవారం కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ షాదీఖానా పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, తిరిగి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పీరాసాబ్, షేక్‌అహ్మద్, ఉస్మాన్, జాఫర్, జె.ఖాజా పాల్గొన్నారు.

రైతులు బీమాను సద్వినియోగించుకోవాలి

మద్దికెర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ పంటలో సాగు చేసిన పంటలకు రైతులందరూ ఈ నెల ఆఖరులోపు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోపు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి బీమా గడువు ముగుస్తుందన్నారు. అందువల్ల రైతులందరూ సాగు చేసిన వరి, కొర్ర, సజ్జ, టమోటా పంటలకు బీమా చెల్లించాలన్నారు. సమావేశంలో ఏఈవో భోజరాజు, వ్యవసాయ సిబ్బంది ఆనంద్ తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి


మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువుకుని ఉద్యోగ అవకాశాలు లేని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్ గౌడు అన్నారు. శుక్రవారం మద్దికెరలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గౌడుగు సతీష్ కుమార్, ఉదయ్ కుమార్, గడ్డం మల్లి కార్జున, అవులపెద్దన్న తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మద్దికెర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలోని ఎం.అగ్రహారంలోని బీసీ కాలనీలో ఎన్నో నెలలుగా పరిష్కారం కాని నీటి సమస్యను శుక్రవారం పరిష్కరించారు. సర్పంచ్ బురుజుల విజయుడు, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ప్రజలు నీటిని దుర్వినియోగం చేయకుండా వినియోగించుకోవాలన్నారు. అలాగే సకాలంలో నీటి, ఇంటి పన్నులు చెల్లించాలన్నారు.

80 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చారు

తుగ్గలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీలో 80 శాతం మందికి ఉద్యోగాలు అందించారని ఆ కంపెనీకి పొలాలు ఇచ్చిన రైతులు కృష్ణమూర్తితో పాటు పలువురు తెలిపారు. శుక్రవారం జొన్నగిరిలో వారు మాట్లాడుతూ జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల మధ్య ఉన్న జియో మైసూరు కంపెనీలో స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇస్తుండటం అవాస్తవమని అన్నారు. ఇప్పటికే పగిడిరాయి, జొన్నగిరి, బొండ్లవానిపల్ల గ్రామాల రైతులు, పొలాలు ఇచ్చిన రైతులందరికీ ఉద్యోగాలు వచ్చాయని అన్నారు.

రైతుల అభివృద్ధే సొసైటీల ధ్యేయం


ధ్రువపత్రాలను అందుకుంటున్న సొసైటీ డైరెక్టర్లు

తుగ్గలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం జొన్నగిరిలో ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా అప్పా వేణుగోపాల్, డైరెక్టర్లు భీమలింగప్ప చౌదరి, చిన్న పెద్దయ్య, బాధ్యతలు స్వీకరించారు. వీరికి సీఈవో గిడ్డయ్య ధ్రువపత్రాలు అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మయ్య చౌదరి, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, మల్లయ్య, మిద్దె రవికుమార్, బాలన్న, మోహన్ తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బందిని కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రికల్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బందినే కొనసాగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకుడు అజీమ్ ఖాన్, డిపో కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ సీఐటీయూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిప్పన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, చరణ్ తేజ శశి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యం


మాట్లాడుతున్న యోగా శిక్షకుడు బసవరాజు

ఆదోని అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చని యోగా శిక్షకుడు బసవరాజు అన్నారు. శుక్రవారం వీరశైవ కల్యాణ మండపంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఆదివారం మరాఠీ గేరిలోని వీరశైవ కల్యాణ మండపంలో ప్రముఖ యోగా గురువు సుధాకర్ గురూజీతో 11 రోజులపాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ తరగతులు 11 రోజుల పాటు జరుగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సంయుక్తంగా శుక్రవారం చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం ఔషధాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, సంస్థ కార్యదర్శి రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి, సంతోషి పాల్గొన్నారు.

అవ్వ బ్యాంకు నికర లాభం రూ.2 కోట్లు


మాట్లాడుతున్న సుబ్బయ్య

ఆదోని టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహాయోగి లక్ష్మమ్మ బ్యాంకు ఈ ఏడాది రూ. 2 కోట్ల నికర లాభంలో ముందంజలో ఉందని బ్యాంకు చైర్మన్ సుబ్బయ్య అన్నారు. శుక్రవారం బ్యాంకులో చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులో రూ. 263.68 కోట్ల డిపాజిట్లు కలిగి రూ. 183.86 కోట్ల వివిధ రకాల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాంకు కార్యకలాపాలను ఆయన సభ్యులకు వివరించారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బేజారు..!

ఆదోని రైతు బజార్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. చిన్నపాటి వర్షానికే నీరంతా చేరి చెరువులా తయారవుతోంది. కూరగాయలు విక్రయిస్తున్న రైతులు, డ్వాక్రా గ్రూపు మహిళలు, కిరాణా దుకాణాదారులు వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. మోస్తరు వర్షం కురిస్తే మోకాలి లోతు నీరు చేరి రైతుల ప్లాట్‌ఫాం పై విక్రయానికి వచ్చిన కూరగాయలన్నీ వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- చిన్నపాటి వానకే నీటి మునక
- కూరగాయలు కొట్టుకుపోయి నష్టపోతున్న రైతులు
- లోతట్టు ప్రాంతంలో మోకాలి లోతు నీరు
- రైతు బజార్ అభివృద్ధిని విస్మరించిన పాలకులు
- 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి



రైతు బజార్‌లోకి చేరిన వర్షపు నీరు(ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పొలంలో పండించుకున్న కూరగాయలను నేరుగా అమ్ముకునేందుకు రైతు బజార్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. 20 ఏళ్ల క్రితం పట్టణంలోని శ్రీనివాస భవన్ పాత బస్టాండ్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రైతు బజార్‌ను ప్రభుత్వ ఏర్పాటుచేసింది. ఉద్యోగులు, గ్రామస్థులు, పట్టణ ప్రజలు రాకపోకలు సాగించే రద్దీ ప్రాంతం కావడంతో రైతు బజార్‌లో తాజాగా కూరగాయలు ఉంటాయని ఎక్కువగా అక్కడే కూరగాయలు కొంటారు. రైతు బజార్ ఆవరణలో లోతట్టు ప్రాంతం కావడంతో పట్టణ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పట్టణంలోని వర్షపు నీరంతా రైతు బజార్‌ను ముంచెత్తుతాయి. దాదాపుగా 35మంది రైతులు మరో 10మంది డ్వాక్రా మహిళలు కూరగాయలు, కిరాణ దుకాణం ద్వారా ఉపాధి పొందుతున్నారు. నిల్వ ఉంచిన కూరగాయలు సైతం కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రైతు బజార్ చుట్టూ ఉన్న వర్షపు నీరు

పురపాలక స్థలం కావడమే

రైతు బజార్ ఏర్పాటు చేసిన స్థలం కావడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు అభివృద్ధి చేసేందుకు జంకుతున్నారు. పట్టణ నడి ఒడ్డున రూ. కోట్ల విలువల చేసే స్థలం కావడంతో పురపాలక అధికారులు ఎప్పుడైనా రైతుబజార్‌ను ఖాళీ చేయమంటే అప్పుడు పరిస్థితి ఏమిటని, దీంతో రైతు బజార్ ప్లాట్‌ఫాం ఎత్తు పెంచేందుకు కూడా నిధులు కేటాయించకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు జంకుతున్నారు.

పాలకులు విస్మరించారు..

పట్టణ జనాబా 2.80 లక్షలుపైగా ఉంటారు. గ్రామీణ ప్రాంతం నుంచి 30వేల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. రెవెన్యూ డివిజన్ కలిగిన పట్టణంలోని ఒకే రైతు బజార్ ఉండడం ఆది కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు. బయట బహిరంగ మార్కెట్‌ల్లో కూరగాయలు అధిక ధరలకు కొని నష్టపోతున్నారు. పాలకులు రైతు బజార్‌ను అభివృద్ధి చేసి ఆర్ట్స్ కళాశాల రహదారి వైపు మరో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు రైతు బజార్‌పై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మరో స్థలం కావాలని ప్రతిపాదనలు పంపాం

రైతు బజార్ పురపాలక ఖాళీ స్థలంలో గతంలో ఏర్పాటు చేశారు. ఆ స్థలం రైతు బజార్‌కు శాశ్వతంగా కేటాయించాలని పురపాలక శాఖను కోరాం. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వచ్చిన ప్రతిసారి నీరంతా వస్తుంది. వర్షపు నీరు చేరకుండా చుట్టు డ్రైనేజీ ద్వారా బయటికి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తాం. మరో రైతు బజార్ ఏర్పాటు కూడా స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

● నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూల్

పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 లక్ష్యం

- సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 వ్యవస్థ లక్ష్యమని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని దానిష్ హాల్‌లో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ4(ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల-భాగస్వామ్య) విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, డీఎస్పీ హేమలత హాజరయ్యారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ47 విధాన కార్యాచరణలో భాగంగా ఆర్థిక అంశాలలో పీ4 విధానాన్ని ప్రవేశపెట్టి నియోజకవర్గ అభివృద్ధి చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అన్నారు. ఆదోని నియోజకవర్గంలో దిగువ దారిద్ర్యరేఖకు ఉన్న 6,600 కుటుంబాలను గుర్తించామని, అందులో రూరల్ నందలో 3,300, అర్బన్‌లో 3,300 కుటుంబాలను గుర్తించామన్నారు. వాటిలో ఇప్పటివరకు 1800 బంగారు కుటుంబాలను 450 మార్గదర్శులు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన దిశగా ప్రవేశపెట్టిన పీ4 విధానం గొప్ప నిర్ణయమని అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దానమ్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ జనార్ధన్, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘాల సభ్యులు, ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ప్రభుత్వం ఎరువుల కొరత లేదని ఉత్తుత్తి మాటలు చెబుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఏ దుకాణానికి వెళ్లినా యూరియా దొకరడం లేదన్నారు. వర్షాలు కురవడంతో పంటకు యూరియా ఎంతో చాలా అవసరం అన్నారు. అధికారులు స్పందించి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడ లింగన్న, చిన్న తిక్కన్న, మునిస్వామి, పెద్దతుంబలం, నాగనాతనహళ్లి, మదిరే గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

టీడీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి


టీడీపీ నేతలతో చర్చిస్తున్న ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు

ఆలూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వర్గాలు పక్కనపెట్టి టీడీపీ అధినేత ఆదేశాల మేరకు కార్యకర్తలు, నాయకులు గ్రామస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయాలని ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు సూచించారు. శుక్రవారం పార్టీ ఆదేశాల మేరకు హాలహర్వి మండల సీనియర్ నాయకులు కామినహాల్ రమేష్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేసి ప్రజలకు అందేలా చూడాలన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి బూత్ కమిటీ సభ్యులు చేసుకోవాలన్నారు. నాయకుల పనితీరు ఆధారంగా నామినేట్ పదవుల్లో అవకాశం ఉంటుందన్నారు. ఈయన వెంట సీనియర్ నాయకులు కృష్ణంనాయుడు ఉన్నారు.

చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం

ఆస్పరి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని ఆలూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని నగరూరులో 'తొలి అడుగు'ను నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ పరమారెడ్డి, నాయకులు యల్లప్ప, గోపాల్, వెంకటేష్‌చౌదరి, శేషాద్రి, మధు, రంగనాథ్, పరమేష్, యుగంధర్, ఈరన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


మొక్క నాటుతున్న నారాయణ ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులంతా నడుం బిగించాలని తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం నారాయణ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చెట్లను నరకడం వల్ల పర్యావరణం కలుషితమై వర్షాలు కురువక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రినిపాల్ లక్ష్మీరెడ్డి ఏజీఎం రమేష్ కుమార్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు


ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

మద్దికెర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయ అధికారులు సమయపాలన పాటించడం లేదు. శుక్రవారం మండల కేంద్రంలోని 2వ సచివాలయంలో 11 గంటలు దాటినా ఒక్క శాఖ అధికారి రాలేదు. రోజూ అధికారులు విధులకు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఆరోపించారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామాంజులు అనే వ్యక్తులు అడంగల్, 1బీ కోసం, కొందరు 'తల్లికి వందనం' డబ్బులు రాలేదని వస్తే.. అధికారులు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు కొంత మంది సర్వేకు వెళ్లి ఉంటారని, మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉంటారని చెప్పారు.

సక్రమంగా విధులకు రాకపోతే చర్యలు

మద్దికెర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు బడిబాట వంటివని ఐసీడీఎస్ సీడీపీవో లలిత అన్నారు. శుక్రవారం స్థానిక 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో లలిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలు తెరవాలన్నారు. సక్రమంగా విధులకు రాకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

అభిమానికి బాలకృష్ణ చేయూత


సినీ హీరో బాలకృష్ణ సతీమణి వసుంధరను కలిసిన అభిమాన సంఘం నాయకులు

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): బాలకృష్ణ వీరాభిమాని బద్రినారాయణ స్వామి కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతూ ఉండడంతో సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన ఉదారతను చాటుకున్నారు. లివర్ మార్పిడి కోసం రూ.20 లక్షలు ఆపరేషన్ ఖర్చులు అవుతుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభిమాని బద్రినారాయణ స్వామి బాలకృష్ణ దృష్టికి అభిమాన సంఘం అధ్యక్షులు సజ్జత్‌హుసేన్ తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి చికిత్స నిమిత్తం రూ.10 లక్షలు ప్రభుత్వం నుంచి విడుదల చేయించారు. శుక్రవారం హిందూపురంలో నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర చేతులమీదుగా బద్రినారాయణస్వామికి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. అభిమాన సంఘం అధ్యక్షుడు సజ్జత్‌హుసేన్, బద్రినారాయణస్వామిలు బాలకృష్ణ, సుహాసినికి కృతజ్ఞతలు తెలిపారు.

డబ్బు కాజేసిన వారిపై చర్యలు

ఆలూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలో మీసేవ కేంద్రాల ముసుగులో ఇన్‌స్టా పే ద్వారా డబ్బులు డ్రా చేసే సమయంలో అదనంగా నగదు దండుకున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వారిపై విచారించి చర్యలు తీసుకుంటున్నట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెయిన్ బజారులో అనాధికారికంగా నిర్వహిస్తున్న సీఎస్‌పీలో అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. డబ్బును బాధితులకు తిరిగి ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి మోసం ఎవరికైనా జరిగి ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దేవనకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట నమోదు చేసుకోవాలని ఏవో ఉషారాణి తెలిపారు. పంట వివరాలను రైతు సేవా కేంద్రాల్లో అధికారులకు తేలియజేస్తే, రైతు పొలంలో సాగు చేస్తున్న పంటను ఈ పంట నమోదు చేస్తారన్నారు. దేవనకొండ రెవెన్యూ పరిధిలో ఈ పంట నమోదును ఏవో ప్రారంభించారు. ఏఈవో అబ్దుల్‌సలాం, మల్లికార్జున, వీఏఏ కళావతి ఉన్నారు.

ఎస్ఎస్ ట్యాంకును పటిష్టం చేస్తాం: ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): బసాపురం సమ్మర్ స్టోరేజ్(ఎస్ఎస్) ట్యాంకును పటిష్టం చేయనున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శుక్రవారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకు దగ్గరలోని ఎల్ఎల్‌సీ కాలువ దగ్గర ఆయన జలహారతి ఇచ్చారు. ట్యాంకు మరమ్మతుల కోసం తాత్కాలికంగా రూ.6 కోట్లతో పాటు శాశ్వత మరమ్మతులు చేయించేందుకు రూ.60 కోట్లు అవసరమవుతాయన్నారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబునాయుడుకు విన్నవించి పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, ఎంఈ సత్యనారాయణ, డీఈలు చలపతి, గోపీనాథ, రామ్మూర్తి, కౌన్సిలర్లు సురేష్, చిన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, అబ్జర్వర్ ధర్మవరపు సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని శుక్రవారపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు గుడిసె కృష్ణమ్మ, ఉమాపతినాయుడు, భూపాల్ చౌదరి, రంగస్వామినాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆస్పరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు రామాంజనేయులు విమర్శించారు. శుక్రవారం మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆస్పరి, దేవనకొండ మండలాల నాయకులు మల్లేష్, బాష అధ్యక్షతన జరిగిన పార్టీ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి 11 సంవత్సరాలు గడిచినా విభజన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధి చేయలేదన్నారు. రాలయసీమ ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిని విస్మరించాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, వీరభద్ర, రవి, బాషా, ఈరన్న పాల్గొన్నారు.

మాదాపురానికి విద్యార్థి బస్సు ప్రారంభం



దేవనకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాపురానికి విద్యార్థి బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. గత మంగళవారం ఒకే బస్సులో 253 మంది విద్యార్థులు ప్రయాణించడంతో నలుగురు విద్యార్థులు ఉపిరాడక అస్వస్థతకు గురికావడం జరిగింది. అధికారులు స్పందించి మాదాపురానికి విద్యార్థి బస్సు సర్వీ సును ప్రారంభించారు. మాదాపురంలో పత్తికొండ ఇన్‌చార్జి మేనేజరు మాదన గ్రామస్థులతో కలసి బస్సులో ప్రయాణించారు. విద్యార్థి, యువజన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

హంద్రీనీవా కాలువకు గండి



దేవనకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తువ్వదొడ్డి వద్ద హంద్రీనీవా సబ్ కెనాల్‌కు గండి పడింది. తువ్వదొడ్డి నుంచి నునుసరాళ్ల వైపు వెళ్లే కాలువ గట్టు కోతకు గురికావడంతో గండిపడింది. కాలువ నిండుగా పారుతుండటంతో నీరు మొత్తం వృథాగా పారుతుంది. గండిని పూడ్చివేయాలని గ్రామస్థులు కోరారు.

టీబీ వ్యాధిపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 35వ వార్డులోని శంకర్ నగర్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం టీబీ వ్యాధిపై స్థానికులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ పృథ్వీరాజ్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు బాబు రాజు, సీతారాముడు, మంజూనాథ్, మేరీ అరుణ, సుబ్బమ్మ భాయి, ఏఎన్ఎం ఈరమ్మ, ఆశావర్కర్లు శాంతి, నాగవేణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడుబూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ చైర్మన్లు పనిచేయాలని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో సహకార సంఘం సొసైటీ చైర్మన్ కందనాతి నరసప్ప ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో సీఎం చంద్రబాబు నాయుడు సహకార సంఘాలను బలోపేతం చేశారన్నారు. బడుగు బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయస్సులో అలుపెరగని పోరాటం చేస్తూ దేశం మొత్తం ఏపీ వైపు చూసే విధంగా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వీరేష్, టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఏసేపు, మురళి కృష్ణ, చావిడి వేంకటేష్, బీజేపీ నాయకుడు పురుషోత్తం గౌడ్, హనుమయ్య, పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం



విరుపాక్షిరెడ్డితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే



కరపత్రం ఇస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఎర్రకోట గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరై చైర్మన్‌గా కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, డైరెక్టర్లుగా కాపు మురళికృష్ణారెడ్డి, బోయ కేశన్నతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతన్న కళ్లలో ఆనందం చూడడమే టీడీపీ ధ్యేయమన్నారు. కడిమెట్ల సొసైటీ నుంచి రైతులకు ఎరువులు, రుణాలు, బంగారం తాకట్టు రుణాలు, పనిముట్లు రైతులందరికీ అందజేస్తామన్నారు. పార్టీలకు ఎలాంటి సంబంధం లేకుండా ప్రతి రైతన్నకు మేలు చేస్తామన్నారు. గతంలో కడిమెట్ల సొసైటీలో ఎన్నో అవకతవకలు జరిగాయని వాటిని చైర్మన్ విరుపాక్షిరెడ్డి సమక్షంలో బయటకు తీస్తామన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు.

జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డలాంటి వాడని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గతంలో రైతుల ప్రభుత్వమని అధికారంలోకి వచ్చి రైతన్నలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, డైరెక్టర్లు మురళికృష్ణారెడ్డి, బోయ కేశన్న, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, కడిమెట్ల చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, శోభనూరు దస్తగిరి, సొసైటీ సీఈవో దత్తాత్రేయ, మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. కడిమెట్ల గ్రామంలో రూ.40లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, కడిమెట్ల సొసైటీ చైర్మెన్ విరుపాక్షిరెడ్డి, డైరెక్టర్లు మురళికృష్ణారెడ్డి, బోయ చంద్ర, రవికుమార్, ఎర్రకోట నరసింహులు, యాదగిరి, చెన్నారెడ్డి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పీఆర్, ఆర్ఆడబ్ల్యూఎస్ ఏఈలు జయన్న, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ చిరుత సంచారం

గోనెగండ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి, ఎన్నెకండ్ల, బెల్లందొడ్డి గ్రామాలలో చిరుత గురువారం రాత్రి మళ్లీ సంచరించింది. చిరుత గ్రామ పంటపొలాల్లో తిరిగిన పాదముద్రలను ఫారెస్టు అధికారులు, పశువుల కాపరులు శుక్రవారం ఉదయం గుర్తించారు. గత రెండు రోజుల క్రితం చంపిన దున్నపోతు కళేభరం దగ్గరకు శుక్రవారం తెల్లవారుజామున వచ్చి మాంసం తిన్నట్లు గుర్తించారు. అలాగే పాదముద్రలు కూడా అగుపించాయి. గత నాలుగు రోజులుగా ఈ మూడు గ్రామాల పంట పొలాలోనే చిరుత సంచరిస్తుంది. దీంతో పంట పొలాలకు మహిళలు, పిల్లలు వెళ్లాలంటే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం హెచ్.కైరవాడి పశువైద్యాధికారి నిర్మలాదేవి తన సిబ్బందితో దున్నపోతు కళేబరానికి పంచనామా నిర్వహించేందుకు వెళ్లారు. అయితే దున్నపోతు కళేబరానికి పంచనామా నిర్వహించేందుకు కూడా అవకాశం లేదన్నారు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ సంఘటన సలాన్ని పరిశీలించారు. చిరుత కారుమంచి కొండలలో నుంచి వచ్చి ఉంటుంది. రెండుమూడు రోజుల్లో మళ్లీతన స్వస్థలంకు పోతుంది. చిరుతను ఎవ్వరు ఏమి అనవద్దని దాడికి యత్నం చేస్తేనే అది దాడి చేస్తుందని ఫారెస్ట్ ఉద్యోగి తెలిపినట్లు గంజహళ్లి సర్పంచ్ రాముడు తెలిపారు. రాత్రి పూట గ్రామాల్లోకి వస్తే పరిస్థితి ఏమిటని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారని పెద్దవారు కూడా గుంపులుగా వెళ్లాల్సి వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి చిరుతను పట్టుకొని అభయారణ్యంలో వదిలివేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని సిరాలదొడ్డి సమీపంలో బాబాఫరీద్ దగ్గర జరిగింది ఎర్రకోట నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం కర్నూలు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొటేకల్లు గ్రామానికి చెందిన వీరాచారితోపాటు లీసాబ్‌కు గాయాలు కాగా ఎర్రకోటకు చెందిన మరో వ్యక్తికి కూడా గాయాలైనట్లు తెలిసింది. దీన్ని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు గాయాలపాలైన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

వాహనాలు సీజ్

మంత్రాలయం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఆదోని ఆర్టీవో మహమ్మద్ ఆవేష్ తెలిపారు. శుక్రవారం మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీలుచేశారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌతాళం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అమరేశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్ననట్లు ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు. మండల సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రాలయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామాలనుంచి చాలా మంది అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీలను తీసుకుంటూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యకర్తలు అధైర్యపడొద్దు టీడీపీతో పాటు రామిరెడ్డి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూర్మింటి భీమిరెడ్డి, గోపాల్, రామకృష్ణ, శివ, నర్సిరెడ్డి, లక్ష్మన్న, రామయ్య, పోలివీరేష్, బొజ్జప్ప, కేశన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

● పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పాల్గొని మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలో 6 నుంచి 10వేల దాకా బంగారు కుటుంబాలను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి, నరవ శశిరేఖ, మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు మల్లయ్య, ఉపేంద్ర రెడ్డి, ప్రభావతి దేవి, వెంకట్రాముడు, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే పత్తి పంటకు రక్షణ

గోనెగండ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో పచ్చపరుగు, పెనుబంక, తెల్లదోమ తామరపురుగు తదితర పురుగులు పత్తి పంటకు ఆశించినట్లు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో హేమలత తెలిపారు. శుక్రవారం వారు మండలంలోని పలు గ్రామాలలో పత్తి సాగు చేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం వారు మట్లాడుతూ పత్తికి చీడపీడలు ఎక్కువగా సోకుతున్నాయి కావున సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించొచ్చని రైతులను కోరారు. ఒక ఎకరానికి 30 పసుపు రంగు జిగురు బట్టలు 30 నీటిరంగు జిగురు పట్టలు 20 తెలుపు రంగు జిగురు పట్టలు మొక్కలకు ఒక అడుగు పై భాగాన పెట్టుకొవాలి. దీంతో పచ్చదోమ, పేనుబంక పురుగులు నివారణ సాధ్యం అవుతుందన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మంత్రాలయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంజీ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శుక్రవారం హెచ్ఎం. హంపయ్య ఆధ్వర్యంలో ఎంజీ చారిటబుల్ సభ్యులు మాచాని సోమ్‌నాథ్ ధని, రమేష్ ధని, గంగాధర్ ధని, పార్కేష్ ధని స్టడీ మెటీరియల్స్ అందజేశారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఠోభరావు, గోపాల్, చంద్రశేఖర్, వీరేష్‌రావు, ప్రసన్న కుమారి, రవీంద్ర, నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: విద్యార్థులు చదువుకోవడం వల్ల జ్ఞానం, నైపుణ్యాలు సంపాదించడమేగాక, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎమ్మిగనూరు శ్రీమల్లికార్జున ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మల్లికార్జున, యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత భీరప్ప, ప్రధానోపాధ్యాయులు నాగన్న పేర్కొన్నారు. శుక్రవారం బోడబండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు మల్లికార్జున, యాపిల్ ల్యాబ్ అధినేత బీరప్పలు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఉపాధ్యాయులు నల్లన్న, ప్రమీళ, ఆస్పత్రి మేనేజర్ నరసింహులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెండి రథంపై ప్రహ్లాదరాయలు



వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శక్రవారం శ్రావణమాస పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచాలమ్మకు విశేషాభిషేకం

రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతులమీదుగా సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు.

అన్నదానానికి వంట సరుకులు విరాళం

రాఘవేంద్రస్వామి మఠంలో అన్నదానానికి ప్రముఖ కిరాణా షాపుల వ్యాపారులు భారీగా వంట సరుకులు విరాళంగా ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, స్టోర్ ఇన్‌చార్జిలు నారాయణ రావు, బద్రినాథ్‌లు తెలిపారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వీటన్నింటినీ శ్రీమఠం అన్నదానానికి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

ఆర్వో ప్లాంట్లు ప్రారంభం

రాఘవేంద్రస్వామి సన్నిధానంలో భక్తులకు శుద్ధజలాన్ని అందించాలనే ఉద్దేశంతో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఆర్వో ప్లాంటును లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అధికారులు) విరాళం అందజేశారు. మధ్వమార్గ్ కారిడార్ మెయిన్‌గేటు, సుయతీంద్ర వసతి నిలయం (200 గదుల) వద్ద ఆర్వో ప్లాంట్లును ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ ఏఏఎం హిలాలీ, ఎస్‌డీఎం వైవీ రావు ఆధ్వర్యంలో రూ.50 లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసి వేలాది మంది భక్తులకు నిరంతరం రాఘవేంద్రస్వామి జలప్రసాదంగా నామకరణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు.

రాఘవేంద్రుని సన్నిధిలో రీజినల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

రాయలసీమ రీజినల్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆమెకు మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్ లు ఘనంగా స్వాగతం పలికారు. ఈమె వెంట ఆదోని ఆర్‌టీఓ మహమ్మద్‌ఆవేష్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి తదితరులు ఉన్నరు.

పొంచి ఉన్న ప్రమాదం



తిప్పనూరులో శిథిలమైన విద్యుత్ స్తంభం

గోనెగండ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పనూరు గ్రామంలో బీసీ కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారి శిథిలావస్థకు చేరింది. విద్యుత్ స్తంభంకు కింది భాగంలో ఉన్న సిమెంట్ మొత్తం పోయి లోపల ఉన్న ఇనుప కడ్డీలు తేలాయి. దీంతో బలమైన గాలి వీస్తే స్తంభం కిందపడే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.. పలుమార్లు విద్యుత్ శాఖ ఏఈకి ఈ విషయం విన్నవించినప్పటికీ స్పందించలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పీ-4 సర్వేలో మార్పు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పీ ఫోర్ పథకం సర్వేలోని మూల సూత్రాల్లో మార్పు చేయాలని సీపీఎం నాయకులు రాముడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 పథకం మూల సూత్రాలైన తాగునీటి కొళాయి, గ్యాస్, అకౌంట్, విద్యుత్ ఉండరాదు. ఈ సౌకర్యాలను పొందని వారిని మాత్రమే పీ-4 సర్వేలో గుర్తించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలో మార్పులు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. క్రార్యక్రమంలో లక్ష్మన్న, కృష్ణ, షేక్షావలి, నరసప్ప పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్డ్ డ్రైవర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఆర్‌టీసీ డిపోలో ఆన్‌కాల్డ్ డ్రైవర్ల పోస్టులకు హేవీ వేహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వారికి కచ్చితంగా 18 నెలల సీనియారిటీ ఉండాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆన్‌కాల్డ్ డ్రైవర్లకు, బడి బస్సు డ్రైవర్లకు రోజుకు రూ 600, ఒక రోజు డ్యూటి డ్రైవర్లకు రూ800 చోప్పున చెల్లిస్తున్నామని అన్నారు.

బాధ్యతలు చేపట్టిన పీఏసీఎస్ అధ్యక్షుడు గోపాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాల్

నందవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా దర్మాపురం గోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారి సుదర్శనంతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎరువుల నిల్వ(ఇండెంట్) ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. ఎరువులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కొరత రాకుండా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బీవీ జయనాశ్వరరెడ్డి రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో శేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు జీవకోటికి ఆధారం

నందవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మొక్కలు జీవ కోటికి ఆధారమని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ అన్నారు. శుక్రవారం మాచపురంలో 2000 మొక్కలు నాటే కార్యక్రమం గ్రామ టీడీపీ నాయకుడు వలీ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ విద్యాకమిటీ చైర్మన్ పీరసాబ్, మాజీ ఎంపీటీసీ కాలేబు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు రంజాన్, దేవసహాయం పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు థామస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీ-4 నియోజకవర్గ సమావేశానికి హాజరైన సబ్ కలెక్టర్ భరద్వాజకు విద్యార్థులు తమ సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. సీపీఐ తాలుకా కార్యదర్శి భాస్కర్ యాదవ్ మంత్రాలయంలోని 2వేల మంది అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి స్పందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, గ్రామ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, రాగన్న, ఎస్ఐ శివాంజల్, బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

'నిధులు విడుదల చేయాలి'



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విరుపాక్షిరెడ్డి, మద్దిలేటినాయుడు, మాలిక్, దాదావలి, విజయేంద్ర, ఖాజా, ఇస్మాయిల్, సమీఉల్లా, అంజనేయులు, షరీఫ్ పాల్గొన్నారు.